# నా కథ రాయవూ?

ఆదివారం. ఇంట్లోంచి కదిలేందుకు వీల్లేకుండా పొద్దుటి నుంచీ కుండపోతగా వర్షం కురుస్తున్నది.

ఏమైనా రాద్దామంటే, బద్ధకంగా వుంది. పెరల్ బక్ నవల “ది డెవిల్ నెవర్ స్లీప్స్” చదవటం ప్రారంభించాను.

“అమ్మగారూ!” అన్న పిలుపు చిన్నగా వినిపించి, పుస్తకంమీంచి తలతిప్పి పక్కకు చూశాను. లక్ష్మి— మా ఇంటి పనిమనిషి; నా కుర్చీ పక్కనే నేలమీద తలవంచుకుని సిగ్గుపడుతూ కూర్చుని వున్నది. పుస్తకం మూసి టేబిల్ మీద పెడుతూ “ఏఁవిటి లక్ష్మి? ఏం కావాలి?” అని అడిగాను.

లక్ష్మి జవాబివ్వకుండా మరింతగా తలవంచుకుని ముసి ముసి నవ్వులు నవ్వుతున్నది. దాని బుగ్గలు సొట్టలు పడుతున్నాయి. మనిషి నలుపైనా లక్ష్మిలో ఒక వింత సోయగం వుంది.

లక్ష్మి గత ఆరేడు నెల్లనుంచీ మా ఇంట్లో పని చేస్తున్నది. వయసు దాదాపు ఇరవై ఏళ్ళుండవచ్చు. మనిషి బాగా నలుపు—కారు నలుపంటామే అదీ. కొందరి నలుపు ఛాయలో ఓ విధమైన మెరుపు....నిగ నిగ.... వుంటుంది. అలాంటివాళ్ళను చూస్తుంటే, నలుపైనా ఎంత అందంగా వున్నారో అనిపిస్తుంది. లక్ష్మి అలాంటి కోవకు చెందుతుంది. దాని గుండ్రటి చక్రాల్లాంటి పెద్ద కళ్ళూ, వాటిల్లో ప్రస్ఫుటమయ్యే అమాయకత్వం చూసేవారిని ఇట్టే ఆకర్షిస్తవి. చిన్నప్పటినుంచీ కాయకష్టంచేసి జీవించే మనిషేమో—శరీరం పుష్టిగా వంపులు తిరిగి తిరనాళ్ళలో అమ్మకానికి వచ్చే రంగులు పులిమిన మట్టిబొమ్మలా కనిపిస్తుంది. నిజంగా లక్ష్మి కొంచెం చదువూ, సంస్కారం వుండి, మంచి దుస్తులు వేసుకుంటే, అప్పుడు దాని అందంలో ఏదో విలక్షణం వుండి ఎలాంటివారి దృష్టినైనా ఆకట్టుకు తీరుతుందని ఊహించుకునేదాన్ని.

లక్ష్మి ఎందుకనో నాతో మాట్లాడేందుకు బెరుకు పడుతూండేది. నేనూ దాన్ని అంతగా పలకరించేదాన్ని

కాదు. అమ్మతో మాత్రం తన గొడవలన్నీ చెప్పుకుంటూండేది. అమ్మ ఒకసారి చెప్పింది ; దానికి ముసలితల్లి తప్ప మరెవరూ లేరట. తాళి కట్టినవాడు బొంబాయిలో మరెవర్తెతోనో వుంటున్నాడట. ఈ సంగతి విన్నప్పుడు, అయ్యో పాపం అనిపించింది.

ఈ రోజున లక్ష్మి నా కుర్చీ పక్కన కూర్చుని నేల చూపుల చూస్తూ ముసి ముసి నవ్వులు నవ్వటం నాకు కాస్త ఆశ్చర్యం కలిగించింది. బహుశా ఏదైనా పాత చీర అడిగేందుకు తటపటాయిస్తున్నదేమో అనుకుని " చెప్పవే లక్ష్మి ఏం కావాలి ? ఏదైనా పాత చీర.... " లక్ష్మి తల అడ్డంగా తిప్పింది. జవాబు మాత్రం యివ్వలేదు.

' మరి సంగతేమిటి ? ' అన్నాను దానికేం కావాలో అర్థం గాక.

' అమ్మగోరూ ! మీరు కతలు రాస్తారంటగా ? ' అన్నది లక్ష్మి తలఎత్తి నా ముఖంలోకి చూస్తూ. ఆ మాటలనేటప్పుడు దాని తెల్లటి కళ్లు మెరిసినై.

' ఎవరు చెప్పారు ? ' అన్నాను నవ్వుకుంటూ

' ఆ సుశీలమ్మగోరి అమ్మాయి చెప్పింది. ఆ అమ్మాయిగోరు ఎప్పుడూ ఏయో కాగితాలు రాసి చింపేత్తూంటారు. నే నాటన్నిటిని ఊడవలేక చస్తుండా.

ఉండబట్టలేక నిన్న నడిగా, 'ఏమ్మగోరూ, కాగితాలన్నీ రాసి చింపేత్తా రేంటని.... '

'మంచిపనే చేశావ్. ఆ అమ్మాయి ఏమన్నదేఁవిటి ?' అని అడిగాను. లక్ష్మి అమాయికంగా చెప్పుకుపోతున్న మాటల తీరుకు ఆనందిస్తూ.

"కతలు రాయాలని చూస్తున్నానే, లక్ష్మీ" అన్నదా అమ్మాయిగోరు. నా కాశ్చర్యం ఏసింది. కతలు సెపుతారు గాని, రాస్తారా ?" అనడిగా. 'ఎందుకు రాయరూ ? చదువొచ్చిన వోళ్ళు రాసిన కతలు సదువుతారు. రానోళ్ళు చెప్పించుకుంటారు' అన్నదా అమ్మాయిగోరు. నాకు నవ్వాగలా. రాసినా....కతలు గొప్పోళ్ళు రాస్తారుగాని, నీయంటి అమ్మాయిగోర్లు రాస్తారా అని నవ్వేసినా. అప్పుడే ఆ అమ్మాయిగోరు, మీ సంగతి చెప్పింది ! మీరు కతలే కాక, పుస్తకాలు కూడా రాస్తారట. "లచ్చి, లచ్చి, నువ్వా ఇంట్లో పని చేస్తున్నావు గందా, నన్నొసారామె దగ్గిరికి తీసుకుపో," అనడిగింది. 'ఆ కవఁలమ్మగోరు చెప్పింది నిజమేనా, అమ్మగోరూ ?' అన్నది లక్ష్మి నా ముఖంలోకి భయం, గౌరవం పుట్టిపడేలా చూస్తూ. ఆ క్షణంలో లక్ష్మి దృష్టిలో నేను ఎంతో గొప్పదాన్నయి వుండాలి. నాకు నవ్వాగింది కాదు.

' అమ్మగోరూ ! మరి....మరేవోఁ.... ' అంటూ లక్ష్మి పమిటకొంగును ఎడమ చేతి చూపుడువేలుకు చుట్టుకుంటూ, సిగ్గుపడిపోయి తలవంచుకుని ఆగిపోయింది.

' ఊఁ ఆగావేం. చెప్పు. ఏం కావాలి ? ' అన్నాను.

" నవ్వమాకండి, ఏవఁనుకోమాకండి. నామీద ఓ కత రాసి పుస్తకంలో ఏయించండి, నా బొమ్మ కూడా " అంటూ లక్ష్మి సిగ్గువల్లో, లజ్జచేతో పమిటకొంగును ముఖానికి కప్పుకున్నది.

నా క్కలిగిన ఆశ్చర్యం అంతా ఇంతా కాదు. ఇదేం కోర్కె ? మతిలేని కోర్కె !

' నీమీద ఏం కథ రాయమంటావ్ ? ' అని అడిగాను.

' నామీదే కత.... ' అన్నది లక్ష్మి తల వంచుకునే.

" అది సరే, కథ రాయటానికి ఏమైనా విషయం వుండాలి గదా ! "

" నా గురించే రాయండి " అన్నది లక్ష్మి, తనను గురించి చెప్పవలసినదంతా నాకు చెప్పేసినట్టు.

" నీ గురించి రాయాలంటే, నీ జీవితంలో కథకు పనికివచ్చే విశేషమేదన్నా వుండాలి " అన్నాను.

నా మాట విని లక్ష్మి ముఖం చిన్నబోయింది. వెలా తెలా పోతూ నా కేసి చూసింది. నాకు చాలా జాలి

వేసింది. దానికి సంగతి అర్థమయేటట్టు వివరంగా చెప్పాలనుకున్నాను.

" చూడు, లక్ష్మీ ! ఎవర్ని గురించయినా కథ రాయాలంటే, వాళ్ళల్లో కథకు పనికివచ్చే విశేషం ఏమైనా వుండాలి. నీలో అలాంటి దేముందని కథ రాయను ? పోనీ, యీ మాట చెప్పు, నువ్వు ఎవర్నయినా, నిజంగా ప్రేమించావా ? " అన్నాను హాస్యానికి మాట్టాడుతున్నట్టు.

" అంటే ? "

" అంటే, మరేం లేదు, నా తలకాయ. ప్రేమ అంటే ఏమిటో కూడా నీకు తెలీదు, ఇక నీ గురించి కథ రాయటం ఎలా ? రాసినా ఎవరు చదివి మెచ్చుకుంటారు ? " అన్నాను కాస్త విసుగ్గా. లక్ష్మి చిన్నబోయింది.

' అది కాదు లక్ష్మీ, ఈ ప్రశ్నకు జవాబు చెప్పు, నీకు అందరికన్న ఎవరంటే ఎక్కువ యిష్టమో, చెప్పు చూతాం ' అన్నాను.

' మా మాంవంటే ' అన్నది లక్ష్మి తడుముకోకుండా.

' ఎవరా మాంవ ? '

" నా పెనివిుటి " అంటూ సిగ్గుతో గిరుక్కున తల తిప్పేసుకున్నది. ఆ పెనిమిటి అన్న తలపు కలగ్గానే దాని చెంపలు అంత నల్లగా వున్నా ఎర్రవారి కనిపించింది.

'అంటే, మీ మావఁ పెళ్ళికాకముందే నీకు తెలుసా ?' అన్నాను.

'తెలుసు. చిన్నప్పటినుంచీ మా ఇంట్లో వుండేవాడు. మా అయ్యే పెంచాడు.'

'ఓహో అదా. పెళ్ళికిముందే నీకు మీ మావఁ అంటే యిష్టమన్నమాట' అనడిగాను. ఫర్వాలేదు. ఏదో కథా వస్తువు వున్నదన్న నమ్మకంతో.

'ఆడు మా ఇంట్లోనే పెరిగాడు. ఇంతప్పట్నుంచీ వాడంటే నాకు ఇష్టవేఁ. కాని, ఆడు నన్ను బలే కొట్టేవాడు. అయ్య నా కిచ్చిన డబ్బులన్నీ చాటుగా ఆడికిచ్చేదాన్ని. ఆడు ఆ డబ్బె లెత్తుకుపోయి, తేలుకొండిజడ మాణిక్యాం కిచ్చేవాడు. ఆడికి మాణిక్యాం అంటే....ఎర్రగా వుంటుం దనేమో బాగా యిష్టం' అంటూ లక్ష్మి పెద్దగా నిట్టూర్చింది.

'నీ డబ్బులన్నీ తీసుకుపోయి మాణిక్యంకు యిస్తున్నాడని మీ అయ్యకు చెప్పేదానివి కాదా ?' అనడిగాను.

"అమ్మో ఆ మాట చెపితే మా అయ్య ఆణ్ణి బతక నిచ్చేవాడా ? అందుకే చెప్పేదాన్ని కాదు. ఒకసారేం జరిగిందనుకున్నా రమ్మగారూ ! మా అయ్య పట్నంనుంచి ఎంతో డబ్బుపోసి మంచి గాజులు, పచ్చ రిబ్బను తెచ్చి

పెట్టాడు. మా మావ అట్నీ తీసికెళ్ళి మాణిక్కాంకు ఇచ్చొచ్చాడు. "

" అంత యిష్టమైన వస్తువుల్ని మీ మావ కెందు కిచ్చావ్ ? "

'మావడిగితే ఇచ్చాను. ఇవ్వకపోతే నన్ను పెళ్లాడ నన్నాడు. ఆ తరవాత మా అయ్యతో ఆటిని ఎక్కడో పారేసుకున్నానని చెప్పి బాగా తన్నులు తిన్నాను ' అన్నది లక్ష్మి. చిన్ననాటి జ్ఞాపకాల్లోకి జారిపోతున్నట్టుగా కనురెప్పలు మూస్తూ.

" ఇంతకీ ఆ మాణిక్కాం ఆ తరువాత ఏమైంది ? ఇంకా బతికే వున్నదా ? " అనడిగాను.

' బతికుండడం ఏంటమ్మగోరో ! సుబ్బరంగా బొంబాయ్‌లో, మా మావతో కులుకుతున్నది. ఆ మధ్య అక్కణ్ణించి వచ్చిన రంగయ్య ఆ సంగతులన్నీ చెప్పాడు ' అన్నది లక్ష్మి.

నాకు పరిస్థితంతా అర్థమైంది. లక్ష్మిని మొగుడు ఎందుకిక్కడ వదిలేసిపోయాడో తెలిసింది. అయినా, దానికి వాడిమీదవున్న ప్రేమ చూస్తోంటే, మనస్సులో ఎక్కడో కలచినట్లయింది.

"మీ మావఁకు నీమీద యిష్టం ఏమీ వున్నట్టు లేదు. అలాంటప్పుడు ఆ మాణిక్యాంను కాక, నిన్నెందుకు పెళ్ళాడాడు ? " అన్నాను.

' అదంతా మా అయ్య అణ్ణి మెడలొంచి చేయించిన పని. నన్ను పెళ్ళాడకపోతే దమ్మిడీ యివ్వనన్నాడు. మా అయ్య గుర్రబ్బండీ తోలేవాడు. మా మావఁక్కూడా అదే పని. పెళ్ళిరోజున, మా అమ్మ మెళ్ళో జిగిసీ గొలుసు కూడా నా కిస్తానన్నాడు మయ్య. అందుకే అడు నన్ను పెళ్ళాడాడు ' అంటూ లక్ష్మి కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. పాపం దానికి చనిపోయిన తండ్రి గుర్తొచ్చుంటాడు.

' ఆ తరువాత ఏం జరిగింది ? ' అనడిగాను.

" మా పెళ్ళి జరిగిన్రోజున మాణిక్యాం బలే ఏడ్చిందట. మా మావఁ ఏదో చెప్పి ఓదార్చాడంట. పెళ్ళయాక నెల తిరక్కుండానే, పోలీసులైనుకాడ, మయ్య తోలే గుర్రబ్బండిని లారీ డీకొట్టి మయ్య చచ్చిపోయాడు. ఆ తరువాత వారం తిరక్కుండానే, మా మావఁ బండీ గుర్రం అమ్మేశాడు. అమ్మ వద్దని శోకాలు పెట్టింది. ఆ డబ్బుతో బొంబాయెళ్ళి, ఉద్యోగంలో కుదిరి, నన్నూ అమ్మనూ అక్కడికి తీసుకెళతానని మావఁ చెప్పాడు. బొంబాయి ఎళిపోతే, మాణిక్యాంను వదిలేస్తాడని, నాకు చాలా సంతోష మైంది. నే నొప్పుకున్నాను. ఆ రాత్రి అమ్మకూ, నాకూ

కల్లు పట్టుకొచ్చాడు మావ. కోడిని కోసుకుతిన్నాం. తెల్లారి నిద్ర లేచేప్పటికి మావ యింట్లో లేడు. నా మెళ్ళో జిగినీ గొలుసూ, చేతి గోటులూ లేవు. నా పెళ్లికొన్న రెండు కొత్త చీరలు కూడా పోయినై. మాణిక్యం కూడా గుడిశెలో లేదని తెలిసింది. అమ్మా, నేనూ ఆ రోజల్లా శోకాలు పెట్టాం" లక్ష్మి గొంతు బొంగురుపోయింది. చీర కొంగుతో కళ్ళనీళ్లు తుడుచుకున్నది.

నా గుండెలు తరుక్కుపోయాయి. ఎప్పుడూ నవ్వుతూ కనిపించే ఈ అమాయిక ప్రాణిలో యింత పెద్ద అగ్నిపర్వతం వుందని నే నేనాడూ వూహించలేదు.

'ఆ తరవాత మీ మావ ఇటు రానేలేదన్నమాట' అన్నాను.

"ఉహుఁ, మొన్న బొంబాయినుంచొచ్చిన రంగయ్య చెప్పాడు. ఈ పండక్కి వస్తానని నాతో చెప్పమన్నాట్ట!"

ఆ మాటలు చెపుతూంటే అంత దుఃఖంలో వున్న లక్ష్మి ముఖంలో ఏదో కాంతి మెరిసినట్టయింది. దాని హృదయంలో ఎలాంటి భావాలు మెదుల్తున్నయ్యో!

'అమ్మగోరూ, పండగింకెన్నాళ్ళుంది?' అనడిగింది లక్ష్మి ఉత్సాహం వెల్లివిరిసే గొంతుతో.

"ఇంకా యిరవైరోజులుంది" అని చెప్పాను, పక్కన గోడనున్న క్యాలెండర్ కేసి చూస్తూ.

"అమ్మగోరూ, నా కత రాస్తారు గందా ?" అన్నది లక్ష్మి ఆశగా నా ముఖం లోకి చూస్తూ. తిరిగి అసలు విషయానికొచ్చేప్పటికి, నా మనస్సు చివుక్కుమన్నది. కథా ! ఎలా రాసేట్టు ?

'కథ రాయాలంటే నువ్వు చెప్పిన కాస్తా చాలదు పైగా, నీ కథలో ఏముంది నలుగురూ తెలుసుకోవటానికి ? ఓ కారు లేదు. మేడల్లేవు ; పికార్లూ, వెన్నెల్లో పడవ ప్రయాణాల మాటా, లేనే లేదు గదా ?' అన్నాను తేల్చేస్తున్నట్టు నవ్వుతూ.

"పన్నెండైయింది. వస్తానమ్మగోరూ !" అంటూ చిన్నబుచ్చుకున్న ముఖంతో వెళ్ళిపోయింది లక్ష్మి.

నేను కొంచెంసేపు లక్ష్మిని గురించి ఆలోచించి, తరవాత పుస్తకం తీసుకుని చదవసాగాను. చదువుతున్న దేవీ అర్థం కావటంలేదు. లక్ష్మి మాటలింకా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

* * *

తెల్లవారితే పండగనగా, ఆ రోజు సాయంత్రం తలంటుకుని, జుట్టు ఆర్పుకుంటూ కూర్చున్నాను. లక్ష్మి చడీ చప్పుడు లేకుండా వచ్చి, నా కుర్చీ పక్కన తలవంచు క్కూర్చున్నది .... సరిగ్గా ఇరవైరోజుల క్రితం ఎలా

కూర్చున్నదో, అలాగే. ఉహుఁ, కథ రాశానో లేదో కనుక్కోవటానికి వచ్చింది కాబోలనుకున్నాను.

'ఏం లక్ష్మీ పనయిందా ? తీరిగ్గా వచ్చి కూర్చున్నావ్ ? నీ కథ రాశానో లేదో అడిగేందుకేనా ? యిన్నాళ్ళుగా ఆలోచిస్తున్నాను. నువ్వే చెప్పు రాసేందుకేముంది ?' అన్నాను.

"ఆ సంగతి కాదమ్మగోరూ ! రాత్రి బండికి మా మాఁవ వస్తున్నాడు. ఆ మాణిక్కం కూడా దిగుతుంది" అన్నది లక్ష్మి ఉత్సాహంగా.

"ఆ మాణిక్కం క్షూడా ఎందుకు తగలాటం ! దానిమీద నీకు కోపం ఏమీ లేదా ?" అనడిగాను.

'కోపఁవెందుకమ్మగోరూ ! మాలో చాలామందికి సవితులుంటారు. ఈసారి నేనూ, మావతో బొంబాయెళతాను' అన్నది లక్ష్మి.

అది చెప్పే మాటలు వింటూ ఊకొడుతూ ఊరుకున్నాను. ఏమనేందుకూ నాకు మనస్కరించలేదు. దాని అమాయకత్వం, అజ్ఞానం చూసి జాలివేసింది.

'అమ్మగోరూ మరేఁ....' అంటూ లక్ష్మి ఏదో చెప్పబోయి సందేహిస్తూ ఆగిపోయింది.

'ఊఁ చెప్పు ! ఏం కావాలి ?' అన్నాను.

'చిరిగిపోయిన పాత సిల్కు చీరుంటే యివ్వండమ్మగోరూ.' అన్నది లక్ష్మి మాటలు నగం నగం మింగుతూ.

నాకు నవ్వొచ్చింది. భర్త వస్తున్నాడు గనుక పాతదైనా సిల్కు చీరే కావాలి! లేచి వెళ్ళి మరీ పాత బడందిగా చూసి ఒక కాశ్మీర్ సిల్కుచీర తెచ్చి యిచ్చాను. చీర అందుకుంటూనే, వణికే చేతుల్తో ఒకటి రెండుసార్లు నమస్కారంచేసి గడపదాకా వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చింది. జాకెట్ ఏమైనా కావాలని అడుగుతుందేమో అనుకున్నాను

'అమ్మగోరూ, యీ పోగులు కొనుక్కున్నాను' అంటూ కొత్తవి ఎర్ర రాళ్ళ పోగులు చూపించింది. అమ్మా కూతుళ్లు నాలుగిళ్ళలో పనిచేస్తారు. మొగుడు వస్తున్నాడు గనక, యింత కాలంగా కూడబెట్టిన డబ్బు నలభై రూపాయలు పెట్టి, నిన్ననే ఈ పోగులు కొన్నదట. నల్ల ముఖం, తెల్లటి కళ్ళూ, ఎర్రటి పోగులూ భలే బావున్నాయిలే అనుకున్నాను. ఆ మాటంటే ఎంతో సిగ్గుపడిపోయింది. రెండు చేతులకూ నిండుగా పూలగాజులు వేసుకొన్నది. అంత నీచంగా, క్రౌర్యంగా ప్రవర్తించిన దాని మావఁ ఎలా వుంటాడో ఓసారి చూస్తే బావుండు ననిపించింది.

* * *

"అమ్మాయ్, త్వరగా లేవ్వే....పాపం, మన లక్ష్మి ముండ చచ్చిపోయిందట !" అంటూ అమ్మ ఇంకా బాగా తెల్లవారకుండానే నిద్ర లేపింది. పండగపూట నిద్ర లేస్తూనే దారుణమైన వార్త విన్నాను. వాకిట్లోకి వచ్చేసరికి, ఇంటి ముందుగా రోడ్డుమీద జనం పోతూ గొడవగా మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు మాట్లాడుకునేది లక్ష్మి చావు గురించేనని తెలుసుకున్నాను.

లక్ష్మి వాళ్ళుండే గుడిశెలు, మా ఇంటికి కొంచెం దూరంలో రోడ్డవతల పల్లపు ప్రదేశంలో వున్నవి. అమ్మ ఏదో అంటున్నా వినిపించుకోకుండా అటుకేసి నడిచాను. నిన్న సాయంత్రం అంత ఉత్సాహంగా, ఆనందంగా వున్న లక్ష్మి తెల్లవారేసరికి చచ్చిపోవటమేమిటి అనిపించింది నాకు. బహుశా దాని మావ వచ్చివుండడేమో అన్న అనుమానం కలిగింది. మావ వస్తాడు....వస్తాడు అనుకుంటూ లక్ష్మిలోని ప్రతి జీవకణం అతడికోసం ఎదురు చూస్తూ ఉప్పొంగిపోయింది. అతడు వచ్చి వుండడు. అప్పుడు కలిగిన నిరాశలో, ఏమైనా అఘాయిత్యానికి పాల్పడిందేమో ?

'నువ్వు దాన్ని చూట్టానికే బయలుదేరావా ? ఆ గుడిశె ముందంతా పెద్ద గొడవగా వుంది. ఇంతకు ముందెళ్ళి చూసొచ్చాను. అది ఉరిపోసుకు చచ్చిందని చెప్తున్నారు. నేన్నమ్మను. దాన్ని....వాడే చంపేంటాడు' అన్నది అమ్మ నా పక్కనే తలవంచుకు నడుస్తూ.

'వాడంటే—ఓహో! దాని మొగుడా! వాడొచ్చాడా?'

"మొగుడూ మొద్దులూ వాడు రాకున్నా బావుండేది. రాత్రి రావటం, దాన్ని చచ్చేటట్టు కొట్టటం, ఆ మాణిక్యాం అనే దానితో కలిసి సినిమాకి వెళ్ళటం—అన్నీ జరిగాయిట. వాడు అక్కణ్నుంచి తిరిగొచ్చేసరికి ముసల్ది లక్ష్మి తల్లి నిద్రపోతున్నదట. అదేమో ఉరేసుకుని దూలానికి వేళ్ళాడుతున్నదట. ఆ దుర్మార్గపు వెధవకేం, దాని తల్లి కడుపు కాలింది గాని" అని అమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

లక్ష్మి గుడిసె ముందు చాలామంది పోగై వున్నారు. పోలీసులు వాళ్ళని అటూ యిటూ నెట్టేస్తున్నారు. వాళ్ళు కేసు దర్యాప్తు చేస్తున్నారన్నమాట. నేను జనాన్ని తప్పుకుంటూ గుడిసె ముందుకు వెళ్ళాను. వసారాలో లక్ష్మి మృతదేహం పడివున్నది. నన్ను చూస్తూనే లక్ష్మి ముసలి తల్లి గొల్లుమన్నది ఎవరో లక్ష్మి ముఖంమీద కప్పివున్న గుడ్డను పక్కకు లాగారు. నా గుండెలు గతుక్కుమన్నై. లక్ష్మి నాకేసి చూస్తున్నట్టు, నా కథ రాయవూ అని అడుగుతున్నట్టూ నాకు అనుభూతి కలిగింది. 'రాస్తాను లక్ష్మి తప్పక రాస్తాను నీ కథ!' అన్నాను. ఆ మాట మనస్సులో అనుకున్నానో, పైకే అనేశానో చెప్పలేను. కళ్లు వికృతంగా

ముందుకు పొడుచుకు వచ్చాయి. తెరిచివున్న నోట్లో ఎవరో తులసి ఆకులు పెట్టారు. గొంతుమీద తాడు బాగా ఒరుసుకుపోయిన గుర్తుగా తెల్లని చార !

ఇక ఆ ముఖంకేసి చూడలేక గిరుక్కున వెనుదిరిగి జనాన్ని తప్పించుకుంటూ గుడిశె పక్కకు వెళ్ళేసరికి చూరుకింద ఎవరో నేను లక్ష్మికి ఇచ్చిన చీర కట్టుకుని కూర్చుని వుండటం కనిపించి ఉలిక్కిపడ్డాను.

మనిషి వయసులో లక్ష్మికంటే రెండు మూడేళ్లు పెద్దదిగా కనిపించింది. కొంచెం ఎరుపు. ముఖంలో గడసరి తనం, క్రౌర్యం గూడుకట్టుకున్న లక్షణాలు కన్పిస్తున్నై. జర్దా అతిగా నవలటంవల్ల కావచ్చు – పెదవులు నలుపూ ఎరుపూ కలిపిన ఓ కొత్త రంగులో పగిలి వికృతంగా వున్నై. ఇదే, మాణిక్యం అయివుంటుందనుకున్నాను. చెవులకేసి చూస్తే, క్రితంరోజు లక్ష్మి నాకు చూపించిన ఎర్రరాళ్ళ పోగులు మెరుస్తూ కన్పించినై.

ఇది మాణిక్యం. లక్ష్మి సవతి! ఇక దాని మావ.... భర్త ? రోడ్డుకేసి వస్తూండగా, గుడిశెకు అంత దూరంలో వాడూ కనిపించాడు. పోలీసు లడుగుతున్న ఏవో ప్రశ్నలకు, తనను కాదన్నట్లు తల ఎగరేస్తూ జవాబు లిస్తున్నాడు.

కోర మీసాలూ వాడూ, కండలు తిరిగిన శరీరం, ఎర్ర జీరలతో కణకణలాడే కళ్ళూ—చూడటానికి చాలా మోటుగా ఎంతో భయంకరంగా వున్నాడు. ప్ఛీ! పాపం, లక్ష్మి అంతగా ప్రేమించింది ? ప్రేమకు కళ్ళే కాదు ; బుర్ర కూడా వుండదనిపించింది.

అవమానించబడిన ప్రేమ, ద్వేషంగా మారుతుంది. ద్వేషం ప్రతీకారాన్ని కోరుతుంది. ప్రతీకారం నెరపగలిగిన ద్వేషం తిరిగి ప్రేమగా మారుతుంది. ఈ ప్రేమలో పశ్చాత్తాపం వుంటుంది. అది ఎంత గొప్ప త్యాగాన్నయినా చేయిస్తుంది. కాని, ప్రతీకారం తీర్చుకోలేని ద్వేషం తనపై తానే ప్రతీకారం చేసుకుంటుంది. లక్ష్మి చేసిన పని అదే కావచ్చు ! ఏమైనా, లక్ష్మి కథ రాయదలుచుకున్నాను.